క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం

- కమిషనర్ వికాస్‌మర్మత్



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): వినాయకచవితి పండగను పురస్కరించుకుని నగరవ్యాప్తంగా ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగేలా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశామని కమిషనర్ వికాస్‌మర్మత్ తెలిపారు. స్థానిక ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలోని నిమజ్జనం ఘాట్ వద్ద వసతులను శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా గణేశ్ నిమజ్జనోత్సవం



గణనాథుడి నిమజ్జనోత్సవ శోభాయాత్ర

నెల్లూరు(బృందావనం): వినాయకచవితిని పురస్కరించుకుని ట్రంకురోడ్డు గాంధీబొమ్మ వద్ద శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం శివాజీసెంటర్‌లో ప్రతిష్ఠించిన మహాగణపతి నిమజ్జనోత్సవ శోభాయాత్ర శనివారం రాత్రి వేడుకగా సాగింది. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 16 అడుగుల మహాగణపతికి ఐదు రోజులపాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటాలు, పండరి భజనలు, నృత్య ప్రదర్శనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారు నిమజ్జనోత్సవానికి స్వర్ణాలచెరువు వద్ద ఉన్న గణేష్ ఘాట్ తరలివెళ్లారు. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, దయాకర్‌రెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి, ముఖ్య సమన్వయకర్త పి.సురేంద్రరెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసం ఎంతో అవసరం



మాట్లాడుతున్న సెట్నెల్ మేనేజర్ శ్రీనివాసరావు

నెల్లూరు రూరల్: విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం ఎంతో అవసరమని సెట్నెల్ మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. రూరల్ పరిధిలోని బుజబుజనెల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం సెట్నెల్, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం – విద్యా ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్షుడు వేణుగోపాల్, స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం అచ్యుతామణి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు గానగంధర్వుడు బాలుకు గాన నివాళి



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఈ నెల 25వ తేదీన సాయంత్రం 4 గంటలకు సింహపురి సంస్కృతి సమాఖ్య ఆధ్వర్యంలో గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు 40 మంది బాలగాయకులతో గాన నివాళి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ చైర్మన్ నలుబోలు బలరామయ్యనాయుడు తెలిపారు. పురమందిరంలో శనివారం ఆ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌లను ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, మెజీషియన్ రాంజీ, పర్యవేక్షకుడు జి.శేఖర్‌బాబులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బలరామయ్యనాయుడు మాట్లాడుతూ హైదరాబాద్ లిటిల్ మ్యూజీషియన్ అకాడమీ ఆధ్వర్యంలో పాడుతా తీయగా టీవీ ఫేమ్స్‌కు చెందిన 40 మంది నేపథ్య గాయనీ గాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మూడో వర్ధంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఆ సంస్థ కార్యదర్శి రాంజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సభను ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొంటారని, ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు.

మహాగణపతి మనసా స్మరామి

వినాయకచవితి వేడుకలు ఈ నెల 18వ తేదీన అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు తమ ఇష్టదైవం విఘ్నేశ్వరుడి విగ్రహాలను వారి వారి ప్రాంతాల్లో ఏర్పాటు చేసి గత ఐదు రోజులుగా విశేష పూజలు నిర్వహించారు. గణేశ్ మండపాల వద్ద ప్రత్యేక అలంకరణలతో పాటు అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శనివారం స్వామివారి విగ్రహాలను నగరంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం సమీపంలోని స్వర్ణాల చెరువు గణేశ్ ఘాట్ వద్ద భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. కోలాహలంగా జరిగిన గణేశ్ విగ్రహాల నిమజ్జనం కార్యక్రమంలో పలువురు ప్రముఖులతోపాటు వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

– నెల్లూరు(బృందావనం)




గణేశ్ ఘాట్ వద్ద గంగాహారతి



గణేశుడికి హారతి ఇస్తూ..



గణేశ్ ప్రతిమ వద్ద పూజలు నిర్వహిస్తున్న కమలానందభారతిస్వామి



వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తూ..



నిమజ్జనానికి పూర్వం పూజలు



బాలికల కోలాహలం



నిమజ్జనోత్సవంలో భక్తజన సందోహం

గణనాథునికి విశేష పూజలు





నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని భవానీ స్కై టవర్స్ అపార్ట్‌మెంట్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడి విగ్రహానికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. లడ్డూ వేలాన్ని నిర్వహించగా, రూ.60 వేలకు దేశ్‌పాల్‌సింగ్, దేవకి దంపతులు దక్కించుకున్నారు. కోలాహలంగా నిర్వహించిన ఉట్టి మహోత్సవంలో అపార్ట్‌మెంట్ వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సహస్ర చేపట్టిన నృత్య ప్రదర్శన అలరించింది. ఐదు రోజులపాటు పూజలందుకున్న బొజ్జ గణపయ్యను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకు సమర్థవంతంగా వైద్యసేవలు అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు కూడా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఉదారంగా ఆర్థికసాయం మంజూరు చేసి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరు నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన 19 మంది లబ్ధిదారులకు రూ.23 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులకు వైద్యం చేయించుకుంటున్న కుటుంబాలు ఇబ్బందులు పడకుండా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ వైద్యసేవలను విస్తృతం చేయాలి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలను విస్తృతం చేయడంతోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జీజీహెచ్, జిల్లా, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలకు చెందిన వైద్యాధికారులతో కలెక్టర్ సమావేశమై జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందుతున్న వైద్యసేవలు, కాన్పులపై ఆస్పత్రుల వారీగా సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అవసరమైన వైద్యులను, సిబ్బందిని నియమించిందని, అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిపుణులైన వైద్యులు ఉన్నారని గుర్తుచేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి తద్వారా ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి వచ్చే రోగుల వివరాలను రిజిస్ట్రేషన్ నుంచి డిశ్చార్జి వరకు బిల్స్ నమోదు ప్రక్రియను ఆన్‌లైన్‌లో నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేసేలా సంబంధిత వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలకు సంబంధించి పేషెంట్ వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. జీజీహెచ్‌లో రోగుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, ప్రిన్సిపల్ డాక్టర్ జమున, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్, జిల్లా, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చెస్ పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైవీఆర్‌ఆర్ ట్రాన్స్‌పోర్టు సౌజన్యంతో మైపాడు గేటు సెంటర్‌లోని కేపీఆర్ గ్రాండ్ కల్యాణ మండపంలో వైవీ రమణారెడ్డి స్మారక ఆలిండియా చెస్ పోటీలు ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ అధినేత సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం పప్పులవీధిలోని వైవీ రమణారెడ్డి ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించి ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోటీలకు దేశ విదేశాల నుంచి 350 మంది క్రీడాకారుల హాజరవుతున్నారని తెలిపారు.

తక్కువ ధరకే కట్టుడు పళ్లసెట్

నెల్లూరు(బారకాసు): ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా రూ.15 వేలు ఖర్చయ్యే పూర్తి కట్టుడు పళ్లసెట్ కేవలం రూ.వెయ్యికే అందిస్తున్నట్లు నారాయణ దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అజయ్‌రెజినాల్డ్ తెలిపారు. శనివారం స్థానిక చింతారెడ్డిపాళెంలోని ఆ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మలి వయసులో దంత సంబంధిత సమస్యలను అధిగమించేందుకు నారాయణ దంత వైద్యశాల, కట్టుడు పళ్ల చికిత్స విభాగం ఆధ్వర్యంలో తక్కువ ధరకే పూర్తి కట్టుడు పళ్ల సెట్ తీసిపెట్టుకునేలా అమర్చనున్నట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి అక్టోబర్ 25వ తేదీ వరకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

రూ.2.03 లక్షలు పలికిన గణేష్ లడ్డూ



లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న భక్తుడు

నెల్లూరు రూరల్: రూరల్‌లోని కాకుపల్లి పంచాయతీ సామంతులవారితోపులో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదానికి శనివారం సాయంత్రం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో నందకుమార్ అనే భక్తుడు రూ.2.03 లక్షలకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులు భార్గవ్‌రెడ్డి, శ్రీకాంత్, నాగార్జున, తరుణ్, శ్రావణ్, కార్తీక్, సుమంత్, గోపి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు దంతపరీక్షలు



పెన్షనర్లకు దంతపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వివేకానందరెడ్డి

నెల్లూరు(బృందావనం): నగరంలోని భక్తవత్సలనగర్‌లో ఉన్న పెన్షనర్ల సంక్షేమ సంఘం భవనంలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు ఎస్.ఎం.గౌస్ అధ్యక్షతన శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భవిష్యత్‌లో పెన్షనర్లు తమ సమస్యలను సంఘటితంగా ఎదుర్కోవాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఇందిరా మల్టీస్పెషాలిటీ దంతవైద్యశాల అధినేత డాక్టర్ కె.వివేకానందరెడ్డి మాట్లాడుతూ వయస్సు పైబడే కొద్దీ ఎదురయ్యే దంత సమస్యలు, సంరక్షణపై సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం పెన్షనర్లకు దంతపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రమణయ్య, జిల్లా శాఖ కోశాధికారి హజరత్తయ్య, ప్రెసిడెంట్ ఎన్.శ్రీనాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ రఘునాథ్, ఎస్.మాలకొండయ్య, పి.వేణు తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరుకూరులో అన్నదానం

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని పెద్దచెరుకూరులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నెల్లూరు పవన్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, శివసునీల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్ రామ్మోహన్‌యాదవ్, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రాధాష్టమి



రాధాకృష్ణులకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇస్కాన్ మందిరంలో రాధాష్టమిని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి ఆధ్వర్యంలో రాధాకృష్ణుల విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని సర్వాంగసుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుఖదేవస్వామి ఉపన్యసిస్తూ శ్రీకృష్ణాష్టమి తరువాత పక్షం రోజులకు వచ్చే భాద్రపద శుక్ల అష్టమిని రాధాష్టమిగా జరుపుకోవడం సంప్రదాయమని తెలిపారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నెల్లూరు(టౌన్): విద్యానగర్‌లోని శ్రీభీమేశ్వర సంస్కృత కళాశాలలో 1973లో చదివిన విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం స్థానిక జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ సభ్యులు ఎం.సూర్యప్రకాశరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరు, చెన్నై, పూణె, హైదరాబాదు, తిరుపతి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కవి, రచయిత కాళిదాసు పురుషోత్తం, విఠపు బాలసుబ్రహ్మణ్యం సతీమణి పద్మిని హాజరుకానున్నట్లు తెలిపారు.

50 శాతం సబ్సిడీపై విత్తనాలు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని రైతులకు 50 శాతం సబ్సిడీపై మినుము, పిల్లిపెసర, జనుము, జీలుగలను సరఫరా చేయనున్నామని వ్యవసాయశాఖ జిల్లా అధికారి సుధాకర్‌రాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఆర్బీకేల ద్వారా రైతులకు ఈ నెల 25లోపు సరఫరా చేయనున్నామని వివరించారు. వింజమూరు, కందుకూరు సబ్ డివిజన్ల పరిధిలో 80 శాతం సబ్సిడీపై మినుము విత్తనాలను పంపిణీ చేయనున్నామని పేర్కొన్నారు. వీఆర్వో వద్ద రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఆర్బీకేల ద్వారా పంపిణీ చేయనున్నామని వెల్లడించారు.

పోషకాహార మాసోత్సవాలు



చిన్నారుల తల్లులతో సీడీపీఓ, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ సిబ్బంది

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని రంగనాయకులపేట సెక్టార్ పరిధిలోని తడికలబజారులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషకాహార మాసోత్సవాలను ఐసీడీఎస్ సీడీపీఓ అన్నపూర్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పు, పాలు, గుడ్లు తీసుకోవాలని సూచించారు. అలాగే సులభంగా జీర్ణం అయ్యే తృణధాన్యాలు, రాగులు, సజ్జలు, జొన్నలు, గోధుమలు, కొర్రలను ఆహారంతోపాటు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. వీటితోపాటు అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే బాలామృతం, బియ్యం, పాలు, పప్పు, నూనె, అటుకులు, రాగిపిండి, ఖర్జూరం, బెల్లం, చిక్కీలను క్రమం తప్పకుండా తీసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలక్ష్మి, నసీమా, అరుణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే ఏపీఎంఎఫ్ ఆశయం



మాట్లాడుతున్న మల్లికార్జున

నెల్లూరు(బృందావనం): జర్నలిస్టుల సంక్షేమమే ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపీఎంఎఫ్) ఆశయమని ఫెడరేషన్ జిల్లా అడ్‌హక్ కన్వీనర్ ఐ.మల్లికార్జున తెలిపారు. నగరంలోని పురమందిరం ప్రాంగణంలో ఉన్న వర్థమాన సమాజం హాల్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ఫెడరేషన్‌లో సభ్యత్వం తీసుకున్న జర్నలిస్టులకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించనున్నామన్నారు. రానున్న అక్టోబర్ నెలలో ఫెడరేషన్ జిల్లా మహాసభ జరుగుతుందని తెలిపారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాల కోసం కృషి చేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో అడ్‌హక్ కమిటీ కోకన్వీనర్ ప్రసాద్, సభ్యులు శ్రీహరి, మహ్మద్‌రఫి తదితరులు పాల్గొన్నారు.